
# అన్యాయం

మ. రుక్మిణీగోపాల్

మేడమీద కూర్చుని ప్రశాంతంగా చదువుకుంటున్నాను. కింద నుంచి వదిన గట్టిగా కేకలు పెట్టడం వినిపించింది. ఏమిటాని ఆశ్చర్యపోతూ గబగబా కిందికి దిగొచ్చాను. సావిట్లో కనిపించిన దృశ్యం నాకేం కొత్తకాదు.. నేలమీద పాత న్యూస్‌పేపర్లు, పత్రికలు అన్నీ దొంతర్లుగా పెట్టి ఉన్నాయి. వాటిని కొనుగోలు చేసే వ్యక్తి చేతిలో ఖాళీ



త్రాసు పట్టుకుని అక్కడ కూచుని ఉన్నాడు. ఎంచేతో అతని మొహం కొంచెం చిన్నబోయి ఉంది. ఆ కార్యక్రమాన్ని పర్యవేక్షించే నిమిత్తం పక్కనే సోఫాలో కూర్చుని ఉన్న వదిన పెద్ద గొంతుకతో వాడిని నిందిస్తోంది.

అందుకే మీరెంత సంపాదించినా తిండికి కూడా సరిపడక ఇబ్బందులు పడతారు. అన్యాయం సొమ్ము అరుగుతుందా? కిలో అని చెప్పి రెండు కిలోలు లాగేస్తున్నావా? ఎంత మోసం! నయం... చూసుకున్నాను కాబట్టి సరిపోయింది. లేకపోతే ఇవాళ ఎంత నష్టపోయేదానిని!...

వదిన వాక్ప్రవాహానికి అక్కడే కూర్చున్న నా మేనల్లుడు పదిహేనేళ్ల రవి అడ్డుపడ్డాడు.

"అందుకేనేమో మమ్మీ అతను చెప్పిన ధరకన్నా నువ్వు చాలా ఎక్కువ అడిగినా ఇంచు మించు వెంటనే ఒప్పేసుకున్నాడు" అన్నాడు ఎంతో గొప్ప విషయాన్ని కనిపెట్టిన మేధావిలా ఫోజు పెడుతూ.

ఏమిటని అడగక్కరలేకుండానే విషమేమిటో నాకర్థమైపోయింది.

మళ్లీ వదిన అందుకుంది "నిజమేరా! నాకా గ్రహింపే లేకపోయింది. వెర్రిపీనుగుని. ఏయ్, ఇంక నీకమ్మను. వెళ్లిపో. ఇవాళేకాదు, ఇంకెప్పుడూ నీకివ్వను" అంది పేపర్లను అతని దగ్గర నుంచి తన దగ్గరకు లాక్కుంటూ.

అతను అడ్డుపడుతూ "అమ్మా, అలా అనకండమ్మా. పొరబాటే జరిగింది. అసలు నేనలాంటి వాటిని కాను. రేపు పిల్లకు స్కూల్లో ఫీజు కట్టకపోతే పేరు తీసేస్తామన్నారు. అంచేత కొంచెం కక్కుర్తిపడ్డాను. పోనీ మీ చేత్తో మీరే తూచి ఇవ్వండి" అంటూ ప్రాధేయపడుతున్నాడు.

"ఇంక ఛస్తే నీకు ఇవ్వను. మోసంచేసే వాళ్లంటే నాకు పరమ అసహ్యం. ఒరేయ్ రవీ, ఆ పేపర్లను తీసుకెళ్లి లోపల పెట్టెయ్యరా" అంది వదిన.

రవి లేచాడు.

"అలా అనకండమ్మా, తప్పయిపోయిందని ఒప్పుకున్నాగా, క్షమించండి. నా పొట్టమీద కొట్టకండి" అంటూ అతను మళ్లీ ప్రాధేయపడ్డాడు.

వదిన మనసు ఏమాత్రం కరగలేదు. "నేను నీ పొట్టమీద కొట్టడమేమిటి? దేవుడే కొట్టాడు. లేకపోతే అన్యాయం చూస్తూ ఊరుకుం టాడా? ఏయ్, బయటకు వెడతావా, లేకపోతే కుక్కను వదలమంటావా?" అంది.

ఇక లాభంలేదనుకున్నాడులా ఉంది, అతను చేతిలో ఉన్న త్రాసును పక్కనే పెట్టిఉన్న గోనెసంచిలో పెట్టుకుని గుట్టగా పడిఉన్న పేపర్లవంక, పత్రికల వంకా ఆశగా చూస్తూ వెళ్లిపోయాడు. అతను గుమ్మం దాటుతూ కళ్లు తుడుచుకున్నట్లు నాకనిపించింది.

ఆనాడు జరగబోయిన నష్టాన్ని, దానిని తప్పించిన అదృష్టాన్నీ పదేపదే తలచుకుంటూ తల్లీకొడుకు లిద్దరూ పేపర్లను మళ్లీ యథాస్థానంలో చేర్చే ప్రయత్నంలోపడ్డారు. నేను మౌనంగా పైకి వచ్చి నా చదువును కొనసాగిద్దామని కూర్చు న్నాను. కాని చదివినదేదీ మనసుకెక్కడంలేదు. ఏమిటో మనసు పాడయినట్లనిపించింది. దీ నంగా ఉన్న ఆ పేపర్లు కొనేవాడి మొహం కళ్లముందు నిలిచినట్లనిపిస్తోంది. "ఎంత అన్యాయం..." చెవుల్లో గింగురుమంటున్నాయి వదిన మాట

లు. "ఏమిటా అన్యాయం?" అని అనుకోకుండా ఉండలేకపోయాను. రెండు పూటలా కడుపు నిండా తిండికి కూడా కరువైన వాడు, కూతురి స్కూలు ఫీజు కూడా కట్టలేని వాడు డబ్బుకు కొంచెం కక్కుర్తిపడితే అది అన్యాయమా? నిజానికి అన్యాయం, అసత్యం, మోసం ఇలాంటి వాటికి ఏ పరిస్థితిలోనూ మార్పు ఉండదు. కానీ ఇవి ఏ రకమైన కష్టాన్నీ అనుభవించని శ్రీమంతులు వల్లెవేసే మాటలు. ఆకలితో మాడుతున్న వాడికి వాటి అర్థంకాని, విలువ గాని తెలియదు. అనుకోకుండా నా మనసు రెండురోజుల క్రితమే జరిగిన సంఘటనమీదికి పోయింది.

నా మేనల్లుడు రవి పదిహేనవ పుట్టిన రోజు దగ్గరపడుతోంది. అలా చెయ్యాలి, ఇలా చెయ్యాలి... అంటూ వదిన ప్లానులు వేస్తోంది. ఇప్పుడేకాదు, వాడి ప్రతి పుట్టినరోజుకీ ఇంతే. ఒక్కడే కొడుకు మూలాన ఎంతో ఘనంగా జరపాలని ఆవిడ ఊహ. హాలంతా చెమ్కీలు, ప్లాస్టిక్ పువ్వులు, లతలతో అలంకరించడం, చాలామందిని కుటుంబాలతో సహా ఇంటికి పిలవడం, రెండుమూడు స్వీట్లతో సహా చాలా తినుబండారాలు కొనడం, ఇవికాక పెద్ద కేక్, వచ్చిన పిల్లలందరికీ చిన్న చిన్న బహుమతులు ఇవ్వడం, రవికి సరేసరి... చాలా ఖరీదైన బట్టలు, ఇంకా వాడేదన్నా కావాలని కోరితే అదీ... ఇలా చాలా ఖర్చుపెడుతుంది. అన్నయ్యకు ఇలాంటివి అట్టే నచ్చవు.

"ఆ రోజు ఇంట్లో ఓ స్వీటు, హాటూ చేసి, తలంటుపోసుకుని కొత్తబట్టలు కట్టుకుంటే చాలదా?" అంటాడు.


ఏటా దీనిని గురించి ఇద్దరకూ కొంత గొడవే. కాని చివరకు వదిన మాట ప్రకారమే జరుగుతుంది. ఈసారి ఇద్దరూ కొంచెం ఎక్కువ గొడవేపడ్డారు.

"పోనీ పిల్లలు నాలుగైదేళ్లవాళ్లు అయేదాకా అయితే వేరుసంగతి. కాని ఎంత ఎదిగినా ఈ పుట్టినరోజులేమిటి? డబ్బు దండగ కాకపోతే" అని అన్నయ్య వాదన.

"మీరిలాగే అంటారు. మీకేంతెలుసు ఈ రోజుల సంగతి. మొన్న లాయరుగారి అబ్బాయికి ఎంత ఘనంగా జరిపారు! ఇందులో మనం లోటు చేస్తే రేపు వాడు తలెత్తుకుని వాడి స్నేహితులలో తిరగ్గలడా? ఇలాంటి వాటిలో డబ్బుకి చూసుకుంటామా? ఇంకా నయం, కొంతమంది పుట్టినరోజులు పెద్దపెద్ద హెూటళ్లలో ఏర్పాటు చేస్తున్నారు. నేనలా చెయ్యమంటున్నానా? ఈ మాత్రం దానికి కూడా మీరిష్టపడకపోతే ఎలా?" ఇది వదిన వాదన.

ఇలా కొంతసేపు తర్జనభర్జనలైన తరువాత "సరే నీ ఇష్టం" అంటూ అన్నయ్య అవతలికి వెళ్లిపోయాడు.

వదిన ఇష్టం చాలా ఖరీదైనది. నాకు సంబంధం లేదు కాబట్టి 'ఆ రోజు ఎంత ఖర్చయింది' అన్నది నేను తెలుసుకోలేదు. కాని చాలానే ఖర్చుపెట్టారని మాత్రం చెప్పగలను. అంతేకాదు... ఆహార పదార్థాలు బోలెడంత 'వేస్ట్' అయాయి. రెండేళ్ల, మూడేళ్ల పిల్లలకు కూడా ప్లేటు నిండా పదార్థాలు నింపి ఇస్తే వాళ్లు ఏంతింటారు? పోనీ వాళ్ల తల్లులైనా అంత పెట్టవద్దని చెప్పరు. వాళ్లు ఇంచుమించు అన్నీ ప్లేట్లలో వదిలేసారు. కేవలం చిన్నపిల్లలే కాదు... కొంచెం ఎదిగిన పిల్లలు, చాలామంది పెద్దవాళ్లు కూడా ఎవరూ ప్లేటును పూర్తిగా ఖాళీచెయ్యలేదు. గ్లాసులోని చల్లని పానీయాలను ఇంచుమించు పావో, సగమో అందరూ వదిలేసారు, ముఖ్యంగా పెద్దవాళ్లు. ఆ వచ్చిన




వాళ్లు ఎవరూ డొక్కలు మాడినవాళ్లు కాదుగా ప్లేటు పూర్తిగా ఖాళీచేసేందుకు!

పార్టీ అంతా అయి, ఎక్కడివాళ్లక్కడికి వెళ్లిన తరువాత వదిన హాయిగా ఊపిరి పీల్చుకుంది. "హమ్మయ్య! అంతా బాగా జరిగింది. ఈమాత్రం దానికి ప్రతిసారీ మీ అన్నయ్య నాతో గొడవే. ఖర్చంటే ఎలా? అవసరమైనపుడు ఖర్చు పెట్టుకోకపోతే ఈ డబ్బెందుకు?" అంది వదిన ఎక్కడి సామానులక్కడ సర్దడంలో సహాయపడుతున్న నాతో.

నేనేమీ మాట్లాడలేదు. పగం నిండుగా, కొన్ని ఇంచుమించు పూర్తి నిండుగా ఉన్న ప్లేట్లలోని పదార్థాలను చెత్తడబ్బాలో పారవేస్తున్నపుడు మాత్రం నా మనసు చాలా బాధపడింది. అపుడు నాకు రైల్వేస్టేషన్‌లోను, బస్‌స్టాండ్‌లోనూ చెయ్యిచాచి అడుక్కునే చిన్నపిల్లల మొహాలు గుర్తుకువచ్చి ఇంకా బాధ కలిగింది.

పుట్టినరోజు నుంచి మళ్లీ నా ఆలోచనలు ప్రస్తుతంలోకి వచ్చాయి. "కొడుకు పుట్టినరోజుకి డబ్బుఖర్చుని ఏమాత్రం లక్ష్యపెట్టని వదిన ఈరోజు పేపర్లు కొనేవాడి వల్ల వచ్చే స్వల్ప డబ్బు నష్టాన్ని సహించలేకపోయింది. ఆ రోజు పుట్టినరోజునాడు తను ఖర్చుపెట్టిన దాని తో పోలిస్తే ఇది ఎంత చిన్నమొత్తం? మేమందరం కలిసి సరదాగా హోటల్‌కెళ్లి ఖర్చు పెట్టిన దాంట్లో ఇది ఎన్నో వంతు ఉంటుంది!

"నీతి వాక్యాలు వల్లించడం సులువే. సూత్రం ప్రకారం అన్యాయం చెయ్యకూడదు. అబద్ధం చెప్పకూడదు. ఎవరినీ మోసగించకూడదు. ఇంకా చాలా చెయ్యకూడదు. నిజమే. కానీ మనిషి పరిస్థితిని కూడా చూసి కొంచెం మానవత్వంతో ప్రవర్తించవద్దా? లక్షలు ఉన్నవారు, లక్షలు గడించేవారూ డబ్బు దగ్గర అన్యాయం చేస్తే అది నేరం. కాని నిత్యావసరాలు కూడా తీరనివాడు డబ్బు దగ్గర కొంచెం కక్కుర్తిపడితే (తప్పుచేస్తే) శిక్ష కంటే దయ అవసరం కాదా!" చాలాసేపటివరకూ ఆ ఆలోచనలు నన్ను వెంటాడుతూనే ఉన్నాయి. ●